# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

**JUNE - 2002**

# సంక్షిప్త వార్తలు

ఏప్రియల్ 30, మరియు మే 1,2 తేదీలలో రామచంద్రపురం కుమ్మరవీధిలోని క్రీస్తుసంఘము సువార్తకూటములు నిర్వహించిరి. ఆ కూటములలో సోదరులు పి. జాన్‌మోజెస్ (గొల్లపాలెం), సి.హెచ్. సుగుణరావు (వి. సావరం), జి. బాబ్జి (ఆరికిరేవుల), పి. జాన్‌బాబు (మోడేకుర్రు), సి.హెచ్. దేసింగ్, యం. ప్రేమ్‌కుమార్ మరియు జాషువా గూటం గార్లు పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. కుమ్మరవీధి క్రీస్తు సంఘములో సోదరులు యన్. లాజరస్ గారు, ఆయన కుమారుడు ప్రసాద్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

తూర్పుగోదావరి జిల్లా, సామర్లకోట మండలం గూడపర్తి క్రీస్తు సంఘము 3వ వార్షిక సువార్త మహాసభలను మే 1,2,3 తేదీలలో స్థానిక హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిరి. ఆ కూటములలో సోదరులు ఎస్. జాన్ (రాజమండ్రి), పి. ఐజక్ (విశాఖ), పి.ఎస్.ఆర్. జయపాల్ (ర్యాలి), ఎస్. డేవిడ్‌కింగ్ (పాలచర్ల), యమ్. సూర్యారావ్ (పెదపూడి), టి. నతానియేలు (రాయవరం), సి.హెచ్. భాస్కర పౌలు (వేములవాడ) మరియు జాషువా గాటం గార్లు "దేవుని సంకల్పములో మానవుని పాత్ర" అను అంశముపై గంభీరముగా వాక్యపరిచర్య చేసిరి.

వివిధ గ్రామముల నుండి అశేష భక్తులు వచ్చి దైవ వర్తమానమును విని బహుగా సంతోషించిరి. స్థానికులలో అనేకులు వాక్యపరిచర్య విషయంలో తమ సంతృప్తిని వ్యక్తపర్చిరి. క్రీస్తులోనికి 8 మంది బాప్తిస్మము పొందిరి. దూరప్రాంతముల నుండి వచ్చిన వారికి స్థానిక సంఘము భోజన వసతులనేర్పాటు చేసిరి. ముప్పిడి స్వచ్ఛంద సంస్థవారు కూటములలో పేద స్త్రీలకు ఇంచుమించు 100 చీరలు పంచిరి. గూడపర్తిలోను, పరిసర ప్రాంతములలోను సోదరులు యన్. సామ్‌సన్ రాజు గారు గొప్ప సువార్త పరిచర్య చేయుచున్నారు. సంఘము దినదినాభివృద్ధి నొందుచున్నది.

మే నెల 8వ తేదీ సాయంత్రం కందరాడ క్రీస్తుసంఘము ఏర్పాటు చేసిన కూటములో సోదరులు షాన్ హక్‌డార్ఫ్ గారు వాక్యపరిచర్య చేసిరి. జాషువా గూటం గారు తెలుగునకనువదించిరి. క్రీస్తులోనికి ఆరుగురు బాప్తిస్మము పొందిరి.

మే 9వ తేదీ గురువారం కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో సువార్తికుల సదస్సు జరిగెను. ఇంచుమించు 400 మంది హాజరైరి. సోదరులు షాన్ హక్‌డార్ఫ్ గారు మూడు మంచి ప్రసంగములు చేసిరి. 9మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 జూన్ 2002 సంచిక 11


# యేసులో దైవ లక్షణములు

## (Attributes of God in Jesus)

యేసుప్రభువు ఈ లోకములో యున్నపుడు తండ్రియైన దేవుని గూర్చి పదేపదే బోధించుచుండెను. ఆయన శిష్యులలో ఒకడైన ఫిలిప్పు దీనిని గమనించి, "ప్రభువా, తండ్రిని మాకు కనబరచుము, మాకంతే చాలునని ఆయనతో చెప్పగా యేసు, ఫిలిప్పూ, నేనింతకాలము మీయొద్ద ఉండినను నీవు నన్ను ఎరుగవా? నన్ను చూచినవాడు తండ్రిని చూచియున్నాడు. గనుక తండ్రిని మాకు కనపరచుమని యేల చెప్పుచున్నావు? తండ్రియందు నేనును నాయందు తండ్రియు ఉన్నామని నీవు నమ్ముటలేదా? నేను మీతో చెప్పుచున్న మాటలు నాయంతట నేను చెప్పుటలేదు; తండ్రి నాయందు నివసించుచు తన క్రియలు చేయుచున్నాడని" అతనితో చెప్పెను (యోహాను 14:8-10).

యేసు దేవుని మహిమ యొక్క తేజస్సును, ఆయన తత్వము యొక్క మూర్తిమంతమునై యుండెను (హెబ్రీ 1:3). ఆయన దేవుని ఏకైక కుమారుడు. ఆయన దైవత్వమును, దైవ లక్షణములను అన్నిటిని కలిగియుండెను. ఆయన ఇమ్మానుయేలు. అనగా ఆయన ఈ లోకమందుండినప్పుడు దేవుడు మనతో యుండెనని యర్థము (మత్తయి 1:23). క్రీస్తు ఈ లోకమందుండగా ఆయన శక్తితోను, పవిత్రతోను, జ్ఞానముతోను, ప్రేమతోను కూడ దేవుడు మానవులతో ఎట్లుండెనో ఈ పాఠములో కొంత తెలిసికొందము.

## శక్తిలో దేవుడు

యేసుక్రీస్తు తన శక్తిలో దేవుని లక్షణమును కలిగియుండెను. దేవుడు నజరేయుడగు యేసుచేత మహత్కార్యములను, సూచక క్రియలను మనుష్యుల మధ్య చేయించి ఆయన దేవుని కుమారుడని నిరూపించెను (అపొ.కా 2:22). ఆయన చేసిన అద్భుతములు, ఆశ్చర్యములు అనేకములు. ఆయన గ్రుడ్డివారి నేత్రములను తెరచెను, చెవిటివారి చెవులను విప్పెను. మూగ వారిని మాట్లాడు వారిగ చేసెను, కుష్ఠరోగులను శుద్ధిచేసెను, అవిటివారిని బాగుచేసెను, సముద్రము మీద నడిచెను, తుఫానును అణచెను, చనిపోయిన వారిని బ్రతికించెను, మరణ సమాధిని జయించెను. యేసుయొక్క మహిమను, శక్తిని, అధికారమును కన్నులార చూచినవారు దేవుని మహిమను, శక్తిని, అధికారమును చూచిరి.

## పవిత్రతలో దేవుడు

యేసు పవిత్రతలో దేవుని లక్షణములను కలిగియుండెను. ఆయన ఈ లోకములో జీవించినను ఈ లోకమర్యాద చొప్పున నడుచుకొనలేదు. మానవుల వలె అన్ని విధములుగ ఆయన శోధింపబడినను శోధనకు ఆయన లొంగలేదు. అపవాది ఆయనను పడగొట్టుటకు శరీరాశ, నేత్రాశ, జీవపుడంబములను ప్రాముఖ్యముగ చూపించెను. అయినను దేవుని గ్రంథములోని లేఖనముల నుపయోగించి ఆయన అతనిని ఓడించెను (మత్తయి 4:1-11). ఆయన

సమస్త విషయములలోను మనవలెనే శోధింప బడినను పాపములేనివాడుగా ఉండెను అని హెబ్రీ 4:15లో వ్రాయబడి యున్నది. యేసు ఎంత పవిత్ర జీవితమును జీవించెనంటే ఆయన తన్ను విమర్శించుచున్న యూదులను చూచి "నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" అని వారిని ప్రశ్నించ గలిగెను (యోహాను 8:46). నాటినుండి నేటివరకును యేసుక్రీస్తు జీవితములో పాపమును స్థాపించగలిగిన మానవుడెవడును లేడు. అందుకే "క్రీస్తు కూడ మీకొరకు బ్రాధపడి మీరు తన అడుగు జాడలయందు నడుచు కొనునట్లు మీకు మాదిరి యుంచిపోయెను. ఆయన పాపము చేయ లేదు; ఆయన నోటను ఏకపటమును కనబడలేదు. ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు; ఆయన శ్రమపెట్టబడియు బెదరింపక, న్యాయముగా తీర్పుతీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను" అని భక్తుడైన పేతురు వ్రాసెను (1 పేతురు 2:22,23). కుమారుని యొక్క పరిశుద్ధతను చూచిన మానవులు తండ్రియైన దేవుని పరిశుద్ధతను చూడగలిగిరి.

## జ్ఞానములో దేవుడు

యేసు జ్ఞానములో దేవుని లక్షణములను కలిగియుండెను. ఆయన మనుష్యుని అంతర్యము నెరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్య నక్కరలేదు. మానవునికి కావలసినదేమిటో, ప్రాముఖ్యముగ కావలసినదేమిటో ఆయన యెరుగును. అందువలన ఆయన నేర్పిన పాఠములు ఆ అవుసరతను తీర్చగల్గెను. ఈ లోకమందున్న బోధకు లందరికంటె యేసు గొప్ప బోధకుడు. ఆయన బోధించిన రీతిగ ఏ మానవుడు ఎన్నడు బోధించి యుండలేదు. మున్నెన్నడు యెవడు బోధించనిరీతిగా మానవులు జీవించుట యెట్లో యేసు బోధించెను. ఆయన అధికారముతో బోధించెను. యేసునోట నుండి వచ్చిన ప్రతి వాక్యముకూడ నిందారహితమైన ఆయన జీవితమును మరింత ఘనముగా నిరూపించెను. యేసు పలికిన జ్ఞానవాక్యములను వినిన మానవులు దేవుని జ్ఞానమును చెవులార వినగల్గిరి.

# ప్రేమలో దేవుడు

ప్రేమలో యేసుక్రీస్తు దేవుని లక్షణమును కలిగియుండెను. ఆయన ప్రేమమూర్తి. పాపముతోను శాపముతోను నిండియున్న ఈ లోకములో ఆయన కరుణయాత్రను కొనసాగించెను. నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన ఈలోకమునకు వచ్చెను?. ఆయన ప్రేమను రెండు విధములుగ ఈలోకములో కనబరచెను. ఆయన మాటలద్వారాను, క్రియలద్వారాను దేవుని ప్రేమను మానవులకు కనుబరచెను. మానవులు దేవునిని, తోటి మానవులను కూడ ప్రేమించవలెనని ఆయన బోధించెను.

ఒకసారి శాస్త్రులలో ఒకడు వచ్చి ఆజ్ఞలన్నిటిలో ప్రధానమైనదేదని ఆయన నడిగెను. అందుకు యేసు ప్రధానమైనది ఏదనగా - ఓ ఇశ్రాయేలూ, వినుము: మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు. నీవు నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ వివేకముతోను, నీ పూర్ణ బలముతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననునది ప్రధానమైన ఆజ్ఞ. రెండవది, నిన్నువలె నీ పొరుగువానిని ప్రేమింపవలెననునది రెండవ ఆజ్ఞ; వీటికంటె ముఖ్యమైన ఆజ్ఞ మరేదియు లేదని అతనితో చెప్పెను (మార్కు 12:28-31). మరల, మనుష్యులు మీకు ఏమిచేయవలెనని మీరు కోరుదురో అలాగుననే మీరును వారికి చేయుడియని యేసు బోధించెను (మత్తయి 7:12). ఇది మానవులకు ఆయన యిచ్చిన బంగారు సూత్రము. యేసు యొక్క అపొస్తలులలో ఒకడు 1 కొరింథీ 13వ అధ్యా. వ్రాయుచు ప్రేమ యొక్క నిజతత్వమును అందు వివరించెను.

యేసు తన క్రియల ద్వారా దేవుని ప్రేమను మానవులకు బయలుపరచెను. ఆయన ప్రజలకు మేలు చేయుచు సంచరించెను. పగిలిన హృదయములను ఆయన అతికించెను. ఒక గొప్ప మంచి సమరయునివలె మానవుల పాపపు గాయములపై శుద్ధిచేయు ద్రాక్షారసమును, గాయమును మాన్పు తైలమును ఆయన పోసి వారికి ఉపశమనమనుగ్రహించెను. ఆయన తన జీవితమును అనేకుల కొరకు విమోచన క్రయ ధనముగా అర్పించెను (మార్కు 10:45).

"మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదుగాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెను". "తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు" అని యేసు బోధించుటయేగాక తన ప్రాణమును మానవుల పాపపరిహారార్థమై సిలువపై బలియిచ్చి నిరూపించెను (మార్కు 10:45; యోహాను 15:13). యేసు యొక్క ప్రేమను చూచిన మానవులు దేవుని ప్రేమను చూచిరి.

శక్తి, పవిత్రత, జ్ఞానము, ప్రేమలలో యేసును మించిన వాడెవడును లేడు. ఇవన్నియును దేవుని కుమారుని యొక్క లక్షణములు. కుమారుని లక్షణములే తండ్రియొక్క లక్షణములు. యేసుక్రీస్తును గూర్చి మనము ఎంత ఎక్కువగ తెలిసికొన గలిగితే దేవుని గూర్చి అంత ఎక్కువగా తెలిసికొనగలము. తండ్రియైన దేవుని గూర్చి మనము ఎక్కువ తెలిసి కొనగోరుచున్న యెడల ఆయన కుమారుడైన క్రీస్తు జీవితమును ఎక్కువ తెలిసికొనవలసి యున్నది. గనుక బైబిలు అంతటిని ఆవరించుకొని యున్న ఆ దైవ మూర్తిని చేరుటకు ఆయన పరిశుద్ధ గ్రంథమును మనము దినదినము చదువవలసి యున్నది.

యేసుక్రీస్తు యొక్క జీవితచరిత్ర మనకు మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలలో దొరుకును. యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మనము నమ్ము నట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును అవి వ్రాయబడెను. క్రీస్తునామమందు నీవు జీవము పొందగోరుచున్న యెడల క్రీస్తును నమ్ముకొనుము. ఆయన నామములోనికి నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. నమ్మిబాప్తిస్మము పొందిన వానిని ఆయన రక్షించును. నమ్మనొల్లని వానిని శిక్షించును.

# దేవుడు ఒక్కడే

## (There is only one God)

ఈ ప్రపంచములో అనేక జనములు చెట్లును, పుట్లను మాట్లాడని రాయిని, విగ్రహాన్ని, మరియు అనేక విధములైన వస్తువులను దేవుళ్ళు, దేవతలు అని పూజిస్తూ ఉన్నారు. వేమన ఒక పద్యములో ఇలా రచించెను: "కఠినరాళ్ళు తెచ్చి కాళ్ళనదిమిపెట్టి మ్రొక్క వద్దు వెట్టి మూఢులారా ! జీవమందు ముక్తి శిలలందు లేదయా మరియు "యిట్టి ఘటములోన పెట్టిన జీవిని కాన లేక నరుడు కాశికేగి వెదికి వెదికి నరుగు వెట్టివాడై చెడిపోవురా, విశ్వదాభిరామ వినురవేమ". కాని "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములలో అనుకొందురు" (కీర్తనలు 53:1). నిజమైన జీవముగల దేవుడు ఒక్కడే.

**దేవుడు సృష్టికర్త :**

ఆకాశములకు సృష్టికర్తయగు యెహోవాయే దేవుడు; ఆయన భూమిని కలుగజేసి దాని సిద్ధపరచి స్థిరపరచెను. నిరాకారముగా నుండునట్లు దాని సృజింపలేదు. నివాసస్థలమగునట్లుగా దాని సృజించెను. ఆయన సెలవిచ్చున దేమనగా యెహోవాను నేనే మరి ఏ దేవుడును లేడు (యెషయా 45:18).

**దేవుడు మనలను పుట్టించినవాడు :**

యెహోవాయే దేవుడని తెలుసుకొనుడి ఆయనే మనలను పుట్టించెను. మనము ఆయన వారము మనము ఆయన ప్రజలము ఆయన మేపు గొఱ్ఱెలము (కీర్తనలు 100:3).

**దేవుడు మొదటివాడును కడపటి వాడును ఆయనే :**

ఇశ్రాయేలియుల రాజైన యెహోవా వారి విమోచకుడైన సైన్యముల కధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు; నేను మొదటివాడను, కడపటివాడను నేను తప్ప ఏ దేవుడును లేడు (యెషయా 44:6).

**దేవుడు ఆజ్ఞ ఇచ్చువాడు :**

నేను నేనే ఆజ్ఞ ఇచ్చినవాడను, నేనే అతని పిలిచితిని నేనే అతనిని రప్పించితిని అతని మార్గము తేజరిల్లును. నా యొద్దకు రండి యీ మాట ఆలకించుడి (యెషయా 48:15).

**దేవుడు మనకు ప్రకటించి, రక్షించేవాడు :**

నేను నేనే యెహోవాను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. ప్రకటించిన వాడను నేనే రక్షించినవాడను నేనే, దాని గ్రహింప జేసినవాడను నేనే; యే అన్యదేవతయు మీలో నుండి యుండ లేదు. నేనే దేవుడను మీరే నాకు సాక్షులు; ఇదే యెహోవా వాక్కు (యెషయా 43:11-12).

**దేవుడు మనలను దీవించువాడు :**

నీ దేవుడైన యెహోవానే సేవింపవలెను. అప్పుడు ఆయన నీ ఆహారమును నీ పానమును దీవించును. నేను నీమధ్య నుండి రోగమును తొలగించెదను (నిర్గమ 23:25).

**దేవుడు జీవాహారము :**

జీవాహారము నేనే; నా యొ[illegible]యును

ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు (యోహాను 6:35).

**దేవుడు మార్గము, సత్యము, జీవము :**

నేనే మార్గమును, సత్యమును, జీవమును, నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు (యోహాను 14:6).

పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును (యోహాను 11:25).

**దేవుడు అందరిలో ఉన్నవాడు :**

ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి, అందరిలో ఉన్నవాడు (ఎఫెసీ 4:5-6).

ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడియున్నది (మత్తయి 4:10). యెహోవాయే నిత్యాశ్రయ దుర్గము. యుగయుగములు యెహోవాను నమ్ముకొనుడి (యెషయా 26:4).

-- యస్. పాల్ దశరధన్,
నీరువాయి, చిత్తూరు జిల్లా.

# నిజ సంఘము ఒక్కటే

## (There is only one True Church)

లోకంలో వేలకొలది మతశాఖలు (మానవకల్పిత) సంఘాలున్నాయి ! వాటిని వేర్వేరు వ్యక్తులు స్థాపించారు. అవి వేర్వేరు సమయాల్లో స్థలాల్లో స్థాపించబడ్డాయి. ప్రతిశాఖ తన సొంతపద్ధతిలో ఆరాధన జరుపుతాది. వాటి నిర్మాణపద్ధతి వేరు, ప్రమాణ పుస్తకాలు వేరు. వారు బోధించే సిద్ధాంతాలు వేర్వేరు. పాపము నుండి రక్షింపబడే విధానాలను పలురకాలుగా వారు బోధిస్తారు.

బైబిలునందు విశ్వాసులై యేసుక్రీస్తును వెంబడించుచున్నామని చెప్పుకొను వారట్టి మాటలు చెప్పడం వింతగానే యుంటాది ! లక్షలాది ప్రజలు వారిని ప్రశ్నించరు. మరికొంతమందేమో, మనందరం పరలోక వెళ్లుచున్నాం, గాని వేర్వేరు మార్గాల్లో వెళ్లుచున్నాం అని సాకులు చెబుతారు. మరికొందరైతే ఏ సంఘమైనా పరవాలేదు, నీ యిష్టమొచ్చిన సంఘంలో చేరు అని చెబుతారు.

అయితే ఈ విషయాన్ని గూర్చి దేవుడేమైనా చెప్పారా ? బైబిలులో ఏదైనా సంఘము బయలు పర్చబడిందా ! యేసుక్రీస్తు గనుక ఒక సంఘాన్ని స్థాపిస్తే మనం ఏదో ఒక మానవకల్పిత శాఖలో గాక ఆయన సంఘములో యుంటే బావుండును గదా ! బైబిలేమని చెబుతోంది ?

### బైబిలు విభజనను ఖండించుచున్నది !

అయన యందు విశ్వాసముంచువారందరు ఏకమై యుండవలెనని యేసు ప్రార్థించారు (యోహాను 17:20-23). కొరింథులోని సంఘము విభజింపబడియున్నందున పౌలు వారిని ఖండించాడు: "సహోదరులారా, మీరందరు ఏక భావముతో మాటలాడవలెననియు మీలో కక్షలు లేక,

యేకమనస్సుతోను, యేకతాత్పర్యముతోను మీరు సన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను" (1 కొరింథీ 1:10) అని అతడు వ్రాసాడు. క్రైస్తవులు తాము నేర్చుకొనిన బోధకు వ్యతిరేకముగా భేదములను అటంకములను కలుగజేయువారిని కనిపెట్టుకొని యుండాలని చెప్పబడింది (రోమా 16:17).

## ఒకే ఒక్క సంఘము

"ఈ బండమీద నా సంఘమును కట్టుదునని" యేసు వాగ్దానము చేసెను (మత్తయి 16:18). అనేక డినామినేషన్లను కట్టుదునని ప్రభువు వాగ్దానము చేయలేదు ! ఆయన తన సంఘమును కట్టుదునని వాగ్దానం చేసెను. ఆ సంఘము కొరకు ఆయన మృతిబొందారు (అపొ.కా. 20:28; ఎఫెసీ 5:28). యేసు ఒక డినామినేషన్‌ను కట్టినట్లు బైబిలు ఎక్కడా చెప్పుటలేదు! సరిగదా మానవుడు స్థాపించిన ఏదో ఒక సంఘము కొరకు యేసు చనిపోయినట్లు కూడా బైబిలు బోధించుట లేదు. ఆయన ఒకే ఒక్క సంఘము కొరకు చనిపోయారు ! ఆ సంఘమే ఆయన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘము !

సంఘము క్రీస్తు యొక్క శరీరము (ఎఫెసీ 1:22,23). శరీరము ఒక్కటే (ఎఫెసీ 4:4). గనుక వున్న సంఘము కూడ ఒక్కటే. ఆ శరీరమునకు రక్షకుడు క్రీస్తే (ఎఫెసీ 5:25). రక్షింపబడాలంటే మనం ఆయన శరీరంలో యుండాలి. మానవకల్పిత సంఘములో యుంటే మనం రక్షింపబడలేము.

## క్రీ.శ. 33లో సంఘము స్థాపించబడెను

యేసు తన సంఘమును కట్టుదునని వాగ్దానము చేసెను (మత్తయి 6:18). అంత్య దినములలో ఆ సంఘము నిర్మింపబడునని ప్రవక్తలు ప్రవచించారు (యెషయా 2:2,3; యోవేలు 2:28-32).

యేసు పరమునకు వెళ్లకముందు తన శిష్యులు యెరూషలేములో పరిశుద్ధాత్మ కొరకు కనిపెట్టాలని చెప్పారు (అపొ.కా. 1:4-8). ఆ యాత్మ పెంతెకొస్తునాడు వారిపైకి దిగెను (అపొ.కా. 2:1-13). అది యోవేలు చేసిన ప్రవచన నెరవేర్పేయని పేతురు ఆనాడు చెప్పెను (అపొ.కా. 2:16-21). అతడు ప్రజలకు సువార్త బోధించెను. వారు విని, విశ్వసించినప్పుడు బాప్తిస్మము పొందిరి; ప్రభువు వారిని తన సంఘముతో చేర్చుకొనెను (అపొ.కా. 2:22-47). ఈనాడు కూడ సువార్తకు అదేలాగున విధేయత చూపువారిని ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును !

## యేసే శిరస్సు

"సంఘమను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగునిమిత్తము ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్స 1:18). క్రీస్తు సంఘానికి మానవు డెవరు శిరస్సుగా లేడు. ఎవడైనా బోధకుడు గాని, పాస్టరు గాని, పోపుగాని, ప్రసిడెంటుగాని లేక ఏదైనా కమిటీగాని ఆ ఒకే నిజసంఘానికి శిరస్సు కాదు. యేసుక్రీస్తు ఒక్కరే దాని శిరస్సు! ఆ ఒకే నిజ సంఘము యొక్క ముఖ్యకేంద్రము (Head Quarter), యేసు వున్నచోటనే పరలోకంలో యున్నది.

## స్థానిక సంఘముల స్వాతంత్ర్యము

క్రీస్తు సంఘము ఒక్కటే అయినను, వివిధ ప్రాంతములలో యున్న క్రైస్తవులు స్థానిక క్రీస్తుసంఘ సభ్యులుగా యున్నారు. వారందరు స్థానికసంఘముగా (local congregation) దేవుని నారాధింతురు. "క్రీస్తు సంఘము లన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" యని పౌలు వ్రాసాడు (రోమా 16:16). యివి వివిధ మతశాఖలు కాదు గాని, వివిధ ప్రాంతములలో యున్న క్రీస్తు యొక్క

సంఘములు. కొరింధులో యున్న పరిశుద్ధులకు వ్రాస్తూ పౌలు వారిని "కొరింధులో యున్న దేవుని సంఘము" అని సంబోధించాడు (1 కొరింథీ 1:2). ఎఫెసులోని సంఘపెద్దలు మిలేతులో అతన్ని కలసికోవాలని పౌలు కోరాడు (అపొ.కా. 20:17). గలతీయ సంఘములను గూర్చి అతడు వ్రాసినప్పుడు, గలతీయ ప్రాంతములో యున్న వివిధ స్థానిక సంఘములని అతని ఉద్దేశ్యము (గలతీ 1:2).

పరలోకమునుండి పాలించు క్రీస్తు తప్ప, ఒకే ఒక్క నిజ సంఘమునకు కేంద్రీకృతమైన నిర్మాణపద్ధతి (Central Organization) లేదు. ప్రతిస్థానిక సంఘము దాని పెద్దలను, పరిచారకులను కలిగియున్నది. ప్రతి ప్రాంతములోయున్న ప్రతి స్థానిక సంఘము స్వయంప్రతిపత్తి కలిగి, స్వయం పాలనకలిగి మిగతాస్థానిక సంఘముల నుండి స్వతంత్రురాలైయున్నది. ప్రతిస్థానిక సంఘములోను పెద్దలుందురు. వారినే బిషప్పులనియు, పెస్బిటర్లనియు, లేక పాస్టర్లనియు అందురు. పాస్టర్లు అనగా కాపరులని అర్థము. మరియు పరిచారకులు కూడ ప్రతిస్థానిక సంఘములోను ఉందురు. అంతియొకయలోని సంఘము యెరూషలేము సంఘ పెద్దలకు చందా పంపించారు (అపొ.కా. 11:29,30). పౌలు, బర్నబాలు తమ మొదటి సువార్త యాత్రలోనే ప్రతిస్థానిక సంఘములోను పెద్దలను పరిచారకులను ఏర్పరచిరి (అపొ.కా. 14:23). ఎఫెసు సంఘ పెద్దలను పౌలు పిలువనంపించెను (అపొ.కా. 20:27). అతడు ఫిలిప్పయిలో నున్న పరిశుద్ధులకు, అధ్యక్షులకు, పరిచారకులకు ఒక పత్రిక వ్రాసాడు (ఫిలిప్పీ 1:1). ప్రతిస్థానిక సంఘములో యున్న పెద్దల పర్యవేక్షణ వారు సభ్యులుగా యున్న స్థానిక సంఘమునకే పరిమితి చేయబడినది (1 పేతురు 5:1,2).

## ఆరాధనా పద్ధతి

క్రొత్తనిబంధన సంఘము వారములో మొదటి దినాన్న ఆరాధనకు కూడుకొనిరి (అపొ.కా. 20:7; 1 కొరి 16:1-2). వారు ఆత్మతోను సత్యముతోను

ఆరాధించిరి (యోహాను 4:24). ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుట ద్వారా యేసుక్రీస్తు యొక్క మరణ సమాధి పునరుత్థానాన్ని జ్ఞాపకం చేసుకొనుచుండిరి (మత్త 26:26-29; అపొ.కా. 20:7; 1 కొరి 11:23-26). మానవకల్పిత వాద్యములు లేకుండా వారు దేవునికి స్తుతిగీతములు పాడిరి (ఎఫెసీ 5:19; కొలస్స 3:16; హెబ్రీ 13:15). యేసుక్రీస్తు ద్వారా దేవునికి ప్రార్థనలు చేసిరి (1 తిమో 2:1-8). దేవుని వాక్యముల ఉపదేశింపబడుచుండగా వినుచుండిరి (అపొ.కా. 2:42; 20:17; మత్త 28:20). తాము వర్థిల్లిన కొలది దేవునికి కానుకలిచ్చిరి (1 కొరింథీ 16:1-2).

## సంఘము యొక్కయు సభ్యుల యొక్కయు నామములు

మానవులచే స్థాపింపబడిన డినామినేషన్లు మానవుల పేర్లు చొప్పున పిలువబడ్తాయి. కొన్నిసార్లు తాము బోధించే సిద్ధాంత ప్రకారము అవి పిలువబడ్తాయి. ఉదా:- సెవెంతుడే వారు. మరికొన్ని అవి స్థాపింపబడిన స్థలాన్ని బట్టి పిలువబడ్తాయి. అయితే క్రొత్తనిబంధన సంఘము తన పేరులోనే దేవుని మహిమ పరుస్తాది. అది "దేవుని సంఘమని" "క్రీస్తు సంఘములని" పిలువబడింది (1 కొరి 1:2; రోమా 16:16).

దాని సభ్యులు యేసు దగ్గర నేర్చుకొనేవారు గనుక శిష్యులని పిలువబడ్డారు (అపొ.కా.6:1). వారి లోకము నుండి వేరుచేయబడినవారు గనుక పరిశుద్ధులని పిలువబడ్తారు (1 కొరి 1:2; ఫిలిప్పీ 1:1). వారు దేవుని కుటుంబములోనికి తిరిగి జన్మించిన వారు గనుక దేవుని పిల్లలని పిలువబడిరి (యోహాను 3:3-5; 1 యోహాను 3:1). తమ్మును రక్షించుటకు వారు యేసు నందు నమ్మకముంచిన వారు గనుక కొన్నిసార్లు విశ్వాసులని పిలువబడిరి (అపొ.కా. 5:14; యోహాను 8:24). క్రీస్తు శరీరమైన సంఘములో ఒండొరులతో కూడిన సంబంధాన్ని బట్టి వారు అవయవములని చెప్పబడ్డారు (1 కొరి 12:27).

క్రొత్తనిబంధన సంఘసభ్యులు క్రైస్తవులని కూడ పిలువబడిరి. దేవుడు తన ప్రజలకు ఈ క్రొత్త నామమును అనుగ్రహించునని యెషయా ప్రవచించాడు (యెష 62:2; అపొ.కా. 11:26; 26:28; 1 పేతురు 4:16).

## ఒకే నిజ సంఘములో ప్రవేశించే విధానము

క్రీస్తు సువార్తకు విధేయత చూపుట ద్వారా మనము నిజసంఘములో ప్రవేశించగలము (రోమా 6:16-18; 1 పేతురు 1:22,23). ఒకడు దేవుని వాక్యమును వినవలెను (రోమా 10:17). యేసు క్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించవలెను (యోహాను 8:24); పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను (లూకా 13:5), యేసే దేవుని కుమారుడని ఒప్పుకొనవలెను (మత్తయి 10:32) మరియు పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము పొందవలెను (అపొ.కా. 2:38; మార్కు 16:16). ఒకడు ఈ ఆజ్ఞలకు లోబడినప్పుడు ప్రభువతనిని రక్షించి తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47; 1 కొరి 12:13).

మానవ కల్పిత మతశాఖలు ఈ లోకంలో ఉండవలసిన పనిలేదు. ప్రభువు రాకడలో అవన్నీ నాశనము గావించబడును (మత్త 15:13). క్రీస్తుచే స్థాపించబడిన సంఘము మాత్రమే రక్షించబడును (1 కొరింథీ 15:24; ఎఫెసీ 5:23-27). మానవకల్పిత సంఘములో యుండి నీ రక్షణను భంగపరచుకోవద్దు. క్రీస్తు సువార్తకు లోబడుము. ప్రభువే నిన్ను తన సంఘముతో చేర్చుకొంటారు !!

— (TFW)

# సబ్బాతు ఇంకను నిలిచియున్న యెడల...

## (If the Sabbath is still binding...)

శనివారమే సబ్బాతు దినమనియు, క్రైస్తవులు సబ్బాతును ఆదివారమున గాక శనివారముననే ఆచరించవలెననియు కొందరు బోధకులు ఆయా గ్రామములకు వెళ్ళి బోధించుచున్నట్లును, సబ్బాతు దినము యొక్క సత్యమును తెలిసికొనగోరుచున్నట్లును కొంతమంది మాకు ఉత్తరములు వ్రాసారు. సత్యమును అన్వేషించుచున్న ఈ మా మిత్రులను గూర్చి మేము దేవుని స్తుతించు చున్నాము.

### సబ్బాతు అంటే ?

శనివారమే సబ్బాతు దినము అను సంగతి ఎవరునుకాదనరు. అయితే క్రైస్తవ యుగములో దేవుని ఆరాధించు దినము (సబ్బాతు దినమయిన) శనివారము కానేకాదు. ప్రభువు దినము వారములో ఆఖరి దినముకాక మొదటి దినమైయున్నది. అనేకులు ఆదివారమును సబ్బాతు దినమని పిలుచుచుందురు. గాని అది కేవలము పొరపాటు. ఆదివారము శనివారము ఎట్లుకాదో అట్లే ఆదివారము సబ్బాతు దినముకాదు. సబ్బాతు అనగా విశ్రాంతి అని అర్థము. గనుక మన తెలుగు బైబిలులో 'సబ్బాతు దినము' అని కనబడుటకు బదులు విశ్రాంతి దినము అని కనబడును. దేవుడైన యెహోవా ఇశ్రాయేలీయులను ఇట్లు ఆజ్ఞాపించెను: 'విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి నీ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన యెహోవాకు విశ్రాంతి దినము" (నిర్గమ 20:8-10).

సబ్బాతు దినము శనివారమని మనము తెలిసికొనిన తరువాత క్రైస్తవులు

సబ్బాతును ఆచరించవలెనా ? యను ప్రశ్నను మనము ఇప్పుడు చూచు కొందము. దీనిని గూర్చిన సత్యమును మనము తెలిసికొనవలెనంటే అసలు సబ్బాతు దినమును ఎవరు ఎందువలన ఎప్పుడు ఆచారించవలెనని ఆజ్ఞాపింప బడిరో మనము ముందు తెలిసికొనవలెను.

దేవుడు తన సృష్టిపని యంతటి నుండి యేడవ దినమున విశ్రమించెనని ఆదికాండము 2:3లో మనకు కనబడుచున్నను, అప్పటినుండి ఇంచుమించు 2500 సంవత్సరముల తరువాత మాత్రమే సబ్బాతు దినము ఒక ఆరాధనదినము గాను, పరిశుద్ధదినముగాను ఆచరించవలెనని ఇశ్రాయేలీయులు ఆజ్ఞాపింపబడిరి.

## సబ్బాతు ఎవరికి ?

సబ్బాతును ఆచరించవలెనని ఎవరికి ఆజ్ఞాపింపబడెను ? యూదులకు మాత్రమే ఆజ్ఞాపింపబడెను. ఇశ్రాయేలీయులందరు ఐగుప్తు నుండి విడుదల పొంది సీనాయి కొండకు వచ్చువరకు సబ్బాతును గూర్చి దేవుడు వారిని ఆజ్ఞాపించలేదు. "మోషే ఇశ్రాయేలీయులారా, నేను మీ వినికిడిలో నేడు చెప్పుచున్న కట్టడలను, విధులను విని వాటిని నేర్చుకొని వాటి ననుసరించి నడువుడి, మన దేవుడైన యెహోవా మనతో నిబంధనచేసెను. యెహోవా, మన పితరులతో కాదు, నేడు యిక్కడ సజీవులమైయున్న మనతోనే యీ నిబంధన చేసెను" (ద్వితీ 5:1-3). దీనిని బట్టి ఇశ్రాయేలీయుల పితరులగు అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులు సబ్బాతును ఆచరించుట యెరుగరని, మోషే ఈ మాటలు చెప్పుసరికి సజీవులై యున్న ఇశ్రాయేలీయులతోనే సబ్బాతు ఆచరించుట ఆరంభమైనదని మనము గ్రహించుకొనవచ్చును.

## ఎందుకు ఆజ్ఞాపించబడెను ?

అయితే ఇంచుమించు 2,500 సంవత్సరముల తరువాత దేవుడు

సబ్బాతును గూర్చి ఎందుకు ఇశ్రాయేలీయులను ఆజ్ఞాపించెను? ఈ ప్రశ్నకు జవాబుగా మనము ద్వితీ 5:15ను ఇప్పుడు చదువుకొందము: "నీవు ఐగుప్తు దేశమందు దాసుడవై యున్నప్పుడు నీదైవుడైన యెహోవా బాహుబలము చేతను చాచిన చేతిచేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము: అందుచేతను విశ్రాంతి దినము ఆచరించవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను". ఐగుప్తు దేశమందు దాసులుగా యెవరుండిరి? ఇశ్రాయేలీయులా? అన్యజనులా? ఇశ్రాయేలీయులేగదా! అట్లయినప్పుడు ఐగుప్తులో బానిసలుగా యుండని వారెవరికైనను ఈ ఆజ్ఞ వర్తించునా? వర్తించదు. అయితే దేవుడు సబ్బాతును ఆచరించవలెనని ఎందు నిమిత్తము ఇశ్రాయేలీయుల నాజ్ఞాపించెను? యెహోవా తన బాహుబలము చేత వారిని దాసత్వము నుండి విడిపించెనని వారు జ్ఞాపక ముంచుకొను నిమిత్తము దేవుడు వారి నాజ్ఞాపించెను. ఇప్పుడు మరొక ప్రశ్న: ఇశ్రాయేలీయులు తప్ప మరెవరైనను ఐగుప్తు దేశపు బానిసత్వము నుండి విడిపించబడిరా? ఎవరు లేనేలేరు.

కాబట్టి సబ్బాతును ఆచరించవలెననెడి ఆజ్ఞ ఇశ్రాయేలీయులకే గాని మరెవరికిని వర్తించదు అని నీవు గ్రహించుకొనుము. అది ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపింపబడినందున క్రైస్తవులకు అది వర్తించనే వర్తించదు. సరిగదా, క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రమును బట్టిగాక క్రొత్తనిబంధనను బట్టి నడుచుకొనువారై యున్నారు.

## ఎట్లు ఆచరించాలి?

ఇప్పుడు కూడ శనివారమునాడు సబ్బాతును ఆచరించవలెనని బోధించువారు, దేవుడు ఆజ్ఞాపించిన రీతిగ దానిని ఆచరించుట లేనేలేదు. సబ్బాతును ఆచరించువారు శనివార దినమును ఏపనియు చేయరాదు. దేవుని ఆజ్ఞ ఇట్లున్నది: "కావున మీరు విశ్రాంతిదినము నాచరించవలెను. నిశ్చయముగా

అది మీకు పరిశుద్ధ దినము; ... ఆ విశ్రాంతి దినమున పనిచేయు ప్రతివాడును తప్పక మరణ శిక్షనొందును" (నిర్గమ 31:14-16). అట్లయితే శనివారమే ఆరాధన దినమని ఇప్పుడు కూడ వాదించువారు శనివారమున పనిచేయుట మానివేయుచున్నారా ? లేనేలేదు. గనుక దేవుని మాట ప్రకారము వారు తప్పక మరణశిక్ష నొందవలసినదేగదా?. అయితే ఆ నిబంధనలో ఎవరెవరున్నారో. మనము అపార్ధము చేసికొనకుండు నిమిత్తము నిర్గమ 31:17లో అది నాకును, ఇశ్రాయేలీయులకును ఎల్లప్పుడు గురుతై యుండును అని యెహోవా దేవుడు పలికెను.

"సబ్బాతు దినము నాచరించువారు, విశ్రాంతి దినమున తమ యిండ్లలో ఎక్కడను అగ్ని రాజబెట్టకూడదు" అని నిర్గమ 35:3లో వ్రాయబడి యున్నది. సబ్బాతు దినము ఇప్పటికింకను నిలచియున్నదని బోధించు మన మిత్రులు తమ యిండ్లలో శనివారమునాడు భోజనపానాదులను తయారు చేసికొనుట లేదా? అట్లయితే దేవుని ఆజ్ఞను వారు ప్రత్యక్షముగా ఉల్లంఘించుచున్నారు గదా! సబ్బాతును దేవుడు ఆజ్ఞాపించిన రీతిగా చేయనివారికి మరణశిక్ష విధింపబడవలెనని దేవుడు చెప్పిన దానిని వారొకసారి జ్ఞాపకము చేసికొన వలెనని హెచ్చరించుచున్నాను.

సబ్బాతు దినమున పనిచేసిన వానికి, తన పొయ్యి రాజబెట్టుటకై కట్టెలు ఏరిన వానికి ఎట్టి శిక్ష విధింపబడెనో సంఖ్యా 15:32-36లో వ్రాయబడి యున్నది. "ఇశ్రాయేలీయులు అరణ్యములో ఉన్నప్పుడు ఒకడు విశ్రాంతి దినమున కట్టెలు ఏరుట చూచిరి ... తరువాత యెహోవా - ఆ మనుష్యుడు మరణశిక్ష నొందవలెను. సర్వసమాజము పాళెము వెలుపల రాళ్లతో వానిని కొట్టి చంపవలెనని మోషెతో చెప్పను. కాబట్టి యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్లు సర్వసమాజము పాళెము వెలుపలికి వానిని తీసికొనిపోయి రాళ్లతో వానిని చావగొట్టెను". సబ్బాతు దినమునాడు కనీసము కట్టెలు ఏరుకొన్న మనుష్యునికి

మరణశిక్ష ఆనాడు విధించబడిన యెడల అంతకంటె ఎన్నో రెట్లు ఎక్కువ పనిని శనివారమునాడు చేయుచున్న మన అడ్వెంటిస్టు మిత్రుల గతి ఈనాడేమై యుండవలసినది ?

అంతేకాదు, సబ్బాతు దినము ఇంకా నిలిచి యున్నదని బోధించువారు ఆ దినమున దేవునికి పశుబలుల నర్పించవలసియున్నది. సంఖ్యాకాండము 28:9,10లో ఇట్లు వ్రాయబడి యున్నది: "విశ్రాంతి దినమున నిర్దోషమైన యేడాదివగు రెండు గొర్రెపిల్లలను నైవేద్య రూపముగాను, దాని పానార్పణముగా నూనెతో కలపబడిన తూమెడు పిండిలో రెండు పదియవవంతును అర్పింపవలెను .... యిది ప్రతి విశ్రాంతి దినమున చేయవలసిన దహనబలి". అయితే ఈనాడు జంతుబలులను దేవునికి అర్పించు వారెవరున్నారు? నిశ్చయముగా దేవుని నెరుగనివారేకదా ?

## సబ్బాతు మనకు వర్తించదు

సబ్బాతును గూర్చిన ఆజ్ఞను దేవుడు ఇశ్రాయేలీయులకేగాని మనకియ్యలేదు. ఒకవేళ మనము సబ్బాతును ఆచరించవలెనని ప్రయత్నము చేసినను ఆ దినమందు దేవుడు చెప్పిన దానిని యావత్తును చేయవలెను. లేనియెడల మనము మరణశిక్షకు పాత్రులమగుదుము. నిజానికి మనము సబ్బాతును ఆజ్ఞాపించు చట్టము క్రింద లేక దానికంటె శ్రేష్ఠమైన క్రీస్తు చట్టము క్రింద యున్నాము.. "ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు గనుక ముందియ్య బడిన ఆజ్ఞ బలహీనమైనందునను, నిష్ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడి యున్నది; అంతకంటే శ్రేష్ఠమైన నిరీక్షణ దానివెంట ప్రవేశపెట్టబడెను. దీని ద్వారా దేవుని యొద్దకు మనము చేరుచున్నాము" (హెబ్రీ 7:18-19). యేసు క్రీస్తు సబ్బాతు సంబంధమైన చట్టమును మేకులతో తన సిలువకు కొట్టి దానిని మనకు అడ్డము లేకుండా ఎత్తివేసెను (కొలస్స 2:15). అందువలన క్రైస్తవులు శనివారమున

గాక ఆదివారమున దేవుని నారాధించవలెనని ఆయన ఆజ్ఞాపించుచున్నాడు. దీని విషయమైన మరికొన్ని సత్యములను మా తరువాత పాఠములో నేర్చుకొందము.

-- జాషువా గూటం.

# షేబ దేశపు రాణి
## (The Queen of Sheba)

బహుజన సమూహములు ఆయన యొద్దకు కూడి రాగా వారి యొక్క తిరుగుబాటు స్వభావముతో కూడిన హృదయస్థితి నెరిగినవాడై ప్రభువైన యేసు ఈ విధముగా చెప్పెను: "దక్షిణదేశపు రాణి విమర్శకాలమున ఈతరము వారితో కూడ లేచి వారిమీద నేరస్థాపన చేయును. ఆమె సొలొమోను జ్ఞానమును వినుటకు భూమ్యంతముల నుండి వచ్చెను. ఇదిగో సొలొమోను కంటె గొప్ప వాడిక్కడ నున్నాడు" (లూకా 11:31). ఈ షేబ దేశపు రాణి ఆదినములలో యుండిన రాజులందరి లోను చాల ఘనత కెక్కినది. ఆమె సొలొమోను జ్ఞానమును గూర్చియు, అతని ఐశ్వర్యమును గూర్చియు, యెహోవా నామమును గూర్చియు విని గూఢార్థము గల మాటలచే అతనిని శోధించుటకై వచ్చెను (1 రాజులు 10:1-13).

### ఆమె సొలొమోనును దర్శించిన కారణం

షేబ దేశపు రాణి ఆమె వినిన దానిని గూర్చి చూచి తెలుసుకొనుటకును, ఇశ్రాయేలీయులతో వర్తక వ్యాపారము జరిగించుకొనుటకును వచ్చెనందురు. కాని ప్రభువైన యేసు ఆమె జ్ఞానమును గూర్చి తెలిసికొనుటకే వచ్చెనను మాటల

ద్వారా తెలియపరచెను. ఆమె ప్రయాణము చేసిన దూరము సుమారు 1200 నుండి 2000 మైళ్లు వరకు గలదు. అప్పటి ఆచార ప్రకారము ఆమె రాజైన సొలొమోనుకు బంగారమును, విస్తారమైన గంధవర్గమును రత్నములను ఇచ్చెను. ఆమె రాజ్యమునకు, పరిపాలనకు సంబంధించిన అనేక విషయములను తెలిసికొనుటకు, ఆమె పరిపాలనా సంబంధమైన అనేక ప్రశ్నలను జ్ఞానియైన సొలొమోను ద్వారా తెలిసికొనుటకును వచ్చెను. "నీ కార్యములను గూర్చియు, జ్ఞానమును గూర్చియు నా దేశమందు నేను వినిన మాటనిజమే; అయినను నేను వచ్చి కన్నులారా చూడక మునుపు ఆ మాటలను నమ్మక యుంటిని; ఉన్నవాటిలో సగమైనను నాతో చెప్పబడి యుండలేదు యిప్పుడు నేను తెలిసి కొనుచున్నాను .. నీతి న్యాయముల ననుసరించి రాజకార్యములను జరిగించుటకు ఆయన నిన్ను నియమించెను" (1 రాజులు 10:6-9) అని చెప్పెను.

సొలొమోను యింకను చిన్నవాడుగ యుండినపుడు ఇశ్రాయేలీయులను పరిపాలించే బాధ్యత గలవాడైనందున దేవుడైన యెహోవా తనకు యేమి కావలెనో కోరుకొనుమని చెప్పెను. అప్పుడు సొలొమోను జ్ఞానమును, వివేచనను, దేవుని జనాంగమైన ఇశ్రాయేలీయులను సమర్థతతో పరిపాలించ గలిగే నేర్పరి తనమును అడిగెను (1 రాజులు 3:5-14). సొలొమోను అడిగిన వన్నియు దేవుడతని కనుగ్రహించెను. ఐశ్వర్యమును, ఘనతను అడుగక పోయినను వాటిని కూడ సొలొమోనుకు దేవుడనుగ్రహించెను. యెహోవాకు విరోధమైన జ్ఞానమైనను, ఆలోచనయైనను, వివేచనయైనను నిలువదు (సామె 21:30). సొలొమోనుకు దేవుని నుండి కలిగిన ఈ గొప్ప జ్ఞానమును గూర్చి విని అట్టి జ్ఞానమును సంపాదించు విధమును తెలిసికొనుటకు వచ్చెను.

## జ్ఞాని యెవరు ?

అయితే జ్ఞానియైన వాడెవరు? ఈలోక జ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనమే. అధికమైన విద్య సంపాదించి ఉన్నతమైన పదవులలో యుండి నప్పటికిని దేవుని

మాటలయందు శ్రద్ధ వహించుట, ఆయన ఆజ్ఞల ననుసరించి నడువని వారి జ్ఞానము వెఱ్ఱితనమే. జ్ఞానమును గూర్చి సొలొమోను మహారాజు చెప్పిన కొన్ని విషయములు; 1) ఉపదేశము నంగీకరించువాడు జ్ఞాని (సామె 10:8; 12:15). 2) జ్ఞానుల నాలుక మనోహరమైన జ్ఞానాంశములను పలుకును (సామె 15:2). 3) తల్లిదండ్రులకు విధేయుడగువాడు జ్ఞాని (13:1). 4) తన పెదవులను మూసు కొనువాడు బుద్ధిమంతుడు (సామె 10:19; 14:17). 5) రాబోవు దినముల కొరకు సిద్ధపడువాడు జ్ఞాని. వేసవికాలమున కూర్చుకొనువాడు బుద్ధిగల కుమారుడు (సామె 10:5). మోషే కూడ ఇశ్రాయేలీయుల ప్రజలను గూర్చి ఈ మాట చెప్పుచున్నాడు (ద్వితీయోప 32:29). 6) జ్ఞానము గలవాడు [illegible]లను రక్షించుదురు (సామె 11:30). 7) ద్రాక్షారసము వెక్కిరింతల పాలుచేయును. మద్యము అల్లరి పుట్టించును. దాని వశమైన వారందరు జ్ఞానము లేనివారు (సామె 20:1). 8) పరిశుద్ధతను కాపాడుకొనువాడు జ్ఞాని (సామె 5:1-5; 7:6-27). 9) జ్ఞానము గలవాడు భయపడి కీడు నుండి తొలగును (సామె 14:16).

సొలొమోను కంటె గొప్పవాడైన యేసు: సొలొమోను యొక్క జ్ఞానాంశములు మనము అనేకములు చదువుచున్నాము. సామెతల గ్రంథములో జ్ఞానమును అనేకసార్లు సొలొమోను క్రీస్తు ప్రభువుతో సరిపోల్చుటను మనము గమనించ వలెను. అయితే సొలొమోను జ్ఞానము కంటె మిన్నయైన జ్ఞానము క్రీస్తునందు గలదు. బుద్ధి జ్ఞానముల సర్వసంపదలు ఆయన యందే గుప్తములై యున్నవి (కొలస్స 2:3). ఆయన మాటలను పెడచెవిని పెట్టువారిని గూర్చి విమర్శదిన మందు దక్షిణ దేశపు రాణి వారిమీద నేరస్థాపన చేయునని చెప్పుచున్నారు. షేబ దేశపు రాణి యదార్థతను గుర్తించి దాని ప్రేమించి దానిని గూర్చి తెలిసికొనుటకు భూమ్యంతముల నుండి వచ్చినది. ఆయన మాటలు విని వాటిని గైకొనువాడు బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండునని చెప్పుచున్నారు (మత్తయి 7:23-25). ఇదంతయు వినిన తరువాత తేలిన ఫలితార్థమిదే; దేవుని యందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి (ప్రసంగి

12:13). మన ప్రభువైన క్రీస్తు ఆయన కట్టడలకు విధేయులై జీవించుటయే జ్ఞానసారాంశమని చెప్పుచున్నారు. తనకు విధేయులైన వారందరికి నిత్య రక్షణకు ఆయన కారకుడాయెను (హెబ్రీ 5:9). ఇట్టి పరమార్థమైన జ్ఞానము యొక్క విలువ :*1)* అది ఐశ్వర్యము (సామె 3:14-15). *2)* అది జీవము (8:35). *3)* అది సంతోషము నిచ్చును (3:13). *4)* అది జీవముగను, అలంకారముగను యుండును (3:21-24; 2:3).

## ఎవరిస్తారు ?

**1)** ఈ జ్ఞానము యిచ్చువాడు యెహోవాయే (సామె 2:6). **2)** యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామె 1:7). **3)** మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగ యున్న యెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతని కనుగ్రహించబడును (యాకోబు 1:5). మనము జ్ఞానము కొరకు ప్రార్థించినను దేవుని చిత్తమునకు లోబడునట్లయిన దానిని పొందలేము. **4)** జ్ఞానుల సహవాసము చేయువాడు జ్ఞానము గలవాడగును (సామె 13:20).

షెబ దేశపు రాణి సొలొమోను యొక్క జ్ఞానమును గూర్చి విని దానిని తెలిసికొని, అభ్యసించుటకు దూరమును లక్ష్యపెట్టిక వచ్చి సొలొమోనును అనేక ప్రశ్నల ద్వారా శోధించి జ్ఞానమును గూర్చి తెలిసికొని, ఎంతో సమయమును దానికొరకు వెచ్చించి జ్ఞాన లాభమును పొందియుండుటచే ఇప్పుడు షెబ దేశపు రాణిని మనము జ్ఞాపకము చేసికొనుచున్నాము.

-- లోటీ బెత్ హోబ్స్.

# చదువరులకు విజ్ఞప్తి

సత్యవాక్కు మాసపత్రిక గత 22 సంవత్సరాల నుండి నిర్విఘ్నముగా దేవుని కృపవలన కొనసాగుచున్నది. 2002 ఆగష్టు నెలలో అది 23వ సంవత్సరములో ప్రవేశించును. ప్రస్తుతము అది 10,500 గృహాలను దర్శించు చున్నది. అయితే అది ఇప్పుడు గొప్ప ఆర్థిక సమస్యలను ఎదుర్కొనుచున్నది. కొందరు తలంచుచున్న రీతిగా ఈ పత్రికకు విదేశీ సహాయం యేమీలేదు. యిది ప్రభుత్వము వారిచే రిజిష్టర్ చేయబడిన మాసపత్రిక గనుక విదేశీధనం దీని ప్రచురణలో యేమీ వాడకూడదు, వాడుటకూడ జరుగదు. అది చట్టవిరుద్ధం. ఇంతకాలం అది కేవలం భారతీయుల సహాయసహకారాలతో కొనసాగుచున్నది. అయితే 2002 జూలై నెలాఖరులోగా 30/- రూపాయలు గాని అంతకు ఎక్కువగాని సత్యవాక్కుకు కానుక పంపకపోతే సత్యవాక్కు మీకు అందజేయలేము. గనుక దీనిని గమనించ గోర్తాము. భవిష్యత్తులో సత్యవాక్కు ప్రతినెలా క్రమముగా పొందగోరుచున్నవారు మీ కానుకను జూలై ఆఖరులోగా దిగువ చిరునామాకు **M.O** చేయండి. **M.O** ఫారం మీద మీ అడ్రసు, సత్యవాక్కు లేబిల్ మీద యున్న మీ నంబరు తప్పక వ్రాయండి. మీ కానుకలు పంపవలసిన చిరునామా :-

**SATYA VAKKU**
7-9-35, SAMBAMURTHY STREET,
KAKINADA - 533 004

PH: 0884 - 363722

ఆ రాత్రి రామచంద్రపురం అగ్రహారంలో కూడ ఆయన వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు పి. సుందర్రావ్ గారు సువార్త పనిచేయుచున్నారు. మే 10వ తేదీ నాడు చదలాడ గ్రామములో ఏర్పాటుచేయబడిన కూటములో షాన్ గారు వాక్యపరిచర్య చేయగా 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. చదలాడలో సోదరులు యమ్. ప్రేమ్‌కుమార్ గారు సువార్త చాటుచున్నారు. మే 11వ తేదీనాడు సోదరులు షాన్ గారు అమెరికాకు తిరిగివెళ్లిరి.

మే 12వ తేదీ రాత్రి పిఠాపురం మండలం జమాలపల్లి గ్రామంలో జరిగిన సువార్త కూటములో జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. మరియు బేసిక్ బైబిలు కోర్సు పూర్తిచేసిన 32 మందికి బైబిళ్లు, సర్టిఫికెట్లు అక్కడ అందజేసిరి. జమాలపల్లిలో సోదరులు డి. బుచ్చిబాబు గారు, తదితర యౌవనస్థులు క్రీస్తు సువార్తను నమ్మకముగా చాటుచు మంచి సంఘమును నెలకొల్పిరి.

మే 13,14,15 తేదీలలో ద్రాక్షారామలో యున్న క్రీస్తుసంఘము యేసుక్రీస్తు సువార్త మహాసభలనేర్పాటు చేసిరి. ఆ సభలలో సోదరులు టి.వి. సాంసన్ రాజు, విక్టర్ తురాకా, టి. జ్ఞానానందం, టి. అబ్రాహాం లింకన్, వి. సుదర్శనరావ్, జాషువా గూటం, బి. భాస్కరరావ్, ఎస్. డేవిడ్‌రాజు, టి. ప్రసన్న విజయకుమార్ గార్లు వాక్య పరిచర్య చేసిరి. సభలకు విస్తృత ఏర్పాటుచేయబడెను. సభల యొక్క భారమునంతా సోదరులు టి. ప్రసన్న విజయకుమార్ గారు చక్కగా భరించి నిర్వహించిరి.

మే 16వ తేదీ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడులో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి దేవునికి ప్రతిష్టచేసిరి. ఆరోజు విపరీతమైన ఉష్ణోగ్రతయున్నను తక్కెళ్లపాడు గ్రామస్థులు, సంఘసభ్యులు, పరిసర క్రీస్తు సంఘస్థులు 500 మందికి పైగా హాజరై ఆ సంతోష సమయంలో పాలుపొందిరి. జాషువా గూటం గారు, టి. ప్రసాద్‌రావ్ గారు (మైలవరం) వాక్యపరిచర్య చేయగా స్థానిక సంఘసువార్తికులు కె. బాబూరావ్ గారు ఆ గ్రామములో జరుగుచున్న సువార్త నివేదికను సమర్పించిరి. 1994లో మొదట టి. ప్రసాద్‌రావ్ గారి కృషివలన అక్కడ 16 మందితో క్రీస్తుసంఘము ఏర్పడినట్లును, 8 సంవత్సరాలలో గొప్ప అభివృద్ధి సాధించినట్లును తెలియజేసిరి. ఆలయ నిర్మాణములో ఆర్థిక సహాయం, శ్రమదానం చేసిన వారందరికీ పేరుపేరు చొప్పున కృతజ్ఞత చెల్లించిరి. వచ్చిన వారందరికీ స్థానిక సంఘము మంచి విందు నేర్పాటు చేసిరి. ఒక యువతి క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందెను.

2002 మార్చి 28వ తేదీ నుండి ఏప్రియల్ 15వ తేదీ వరకు సోదరులు కె. జాన్ సుదర్శనం గారు సతీసమేతముగా వెళ్లి బొంబాయి మహానగరంలో సువార్త చాటిరి. ఎనిమిది మంది బాప్తిస్మము పొందిరి. వయోవృద్ధులైనను కుంటముక్కల గ్రామము నుండి బొంబాయి మహానగరంలో సువార్త చాటుచున్న, చాటి వచ్చిన సోదరులు జాన్‌సుదర్శనం గారు అభినందనీయులు.

2002 మే నెల 10వ తేదీ శుక్రవారం నుండి క్రీస్తుసంఘము తరపున సోదరులు బొంతు ధనరాజు (అమలాపురం) గారు టి.వీ లో సువార్త చాటుచున్నారు. యిది అందరు గర్వించదగిన విషయం. ధనరాజు గారి కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం తేజ టి.వీ ఛానెల్‌లో ఉదయం 6 గంటల నుండి 6:30 వరకు చూడవచ్చును. టి.వీ కార్యక్రమాల భారాన్ని సమర్థవంతముగా భరించుచున్న సోదరులు బొంతు ధనరాజు గారు అభినందనీయులు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

~~From~~ To

SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

Addressee not in village. Where he is not know Returned to sender
A Ramesh

To

869X 869/GT
K.GRACEMANI
Z.P.HIGHSCHOOL
PUIRULURU VILL
PEDANANDIPADU(MDL)
GUNTUR DT
522235




Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM